## 4 నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి అథ్లెటిక్స్, వాలీబాల్ పోటీలు

భువనగిరి అర్బన్, నవంబర్ 20 : ఈ నెల 4 నుంచి ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆధ్వర్యంలో 68వ స్కూల్ గేమ్ ఫెడరేషన్ అథ్లెటిక్స్, వాలీబాల్ ఉమ్మడి జిల్లా స్థాయి అథ్లెటిక్స్, వాలీబాల్ క్రీడా పోటీలు యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో జరుగుతాయని ఇంటర్మీడియట్ నోడల్ ఆఫీసర్ రమణ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు పట్టణంలోని సీఎస్ఎన్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మూడు రోజులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. 4న బాల, బాలికలకు అథ్లెటిక్, 5న బాలికలకు వాలీబాల్, 6న బాలురకు వాలీబాల్ జరుగుతాయని చెప్పారు. ఈ పోటీలకు ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇంటర్మీయట్ విద్యాశాఖ అఫ్లియేటెడ్ కాలేజీలన్నీ పాల్గొనాలన్నారు. అథ్లెటిక్స్ అండర్ -19 బాలుర, బాలికల పోటీలకు పూర్తి వివరాల కోసం జి.ఐలయ్య 98855 15530, వాలీబాల్ పోటీలకు పి.రమేశ్‌రెడ్డి 9963085686, ఎన్.ప్రసాద్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ 9848425657 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.



# రైతుల కష్టాలు చూస్తుంటే బాధేస్తుంది

## సన్నబియ్యం బోనస్‌పైనా క్లారిటీ లేదు

- ధాన్యాన్ని వారం రోజుల్లోనే కొనేలా చేయాలి
- పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు లేదు
- ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోవాలి
- డీసీసీ విస్తృత స్థాయి భేటీలో కాంగ్రెస్ నేతల ఆవేదన
- పార్టీ ఎమ్మెల్యేల ముందే ద్వితీయ శ్రేణి నేతల ఆక్రందన
- మీటింగ్‌కు కోమటిరెడ్డి బ్రదర్స్, ఎంపీలు డుమ్మా

నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ) : 'రైతుల కష్టాలు చూస్తుంటే బాధనిపిస్తుంది. నెల రోజులుగా కొనుగోలు కేంద్రాల్లోకి రైతులు ధాన్యం తెచ్చి పోస్తున్నారు. నేటికీ కొనుగోళ్లు సరిగ్గా జరుగుత లేవు. జరిగిన వాటికి డబ్బులు వెంటనే రైతుల ఖాతాల్లో పడ్డలేవు. గతంలో ధాన్యం కొనుగోలు చేసిన వారం రోజుల లోపే డబ్బులు అకౌంట్లలో పడేవి. ఇక సన్న బియ్యానికి 500 రూపాయల బోనస్ అన్నారు. కానీ ఇప్పటికీ ఒక్కరికీ కూడా బోనస్ రాలేదు. దానిపై ఎవ్వరికీ క్లారిటీ లేదు. ఇట్ల రైతులు ఇబ్బందులు పడుతున్నరు. అందుకే ఈ వారం రోజుల్లోనే వడ్లు ఎట్లనైనా కొనేలా చేయాలి. ఇది విమర్శ కాదు. ప్రజల్లో ఉన్న బాధ'... ఈ మాటలు అన్నది ఎవరో సామాన్య రైతు కాదు. సాక్షాత్తు కాంగ్రెస్ పార్టీ నేతలే. శనివారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. దీనికి జిల్లాకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలతో పాటు డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు, డీసీసీ కార్యవర్గ సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు హాజరయ్యారు. కుల గణన, సమగ్ర కుటుంబ సర్వేనే ప్రధాన ఎజెండా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు ద్వితీయ శ్రేణి నేతలు క్షేత్రస్థాయిలోని పార్టీ కార్యకర్తల ఇబ్బందులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై గళమెత్తారు. ఇందులో నల్లగొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల ఇబ్బందులను ఏకరువు పెడుతూ వారి కష్టాలపై దృష్టి సారించాలని ఎమ్మెల్యేలకు విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీల్లోని ఇబ్బందులను ఎమ్మెల్యేల దృష్టికి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. 200లోపు యూనిట్ల ఉచిత కరెంటులో ఇప్పటికీ కొందరికి బిల్లులు వస్తున్నాయని, గ్యాస్ డబ్బులు పడడం లేదని కొందరు ఇలా నిత్యం తమ వద్దకు వచ్చి ఎవరో ఒకరు చెప్పున్నారని అన్నారు. ఇలాంటి వాటిలో లోపాలను ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోవాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలను గుర్తు పెట్టుకోవాలని, ఇందిరమ్మ ఇండ్ల కమిటీల్లోనూ కష్టపడ్డ కార్యకర్తలకు తగిన గుర్తింపు దక్కలేదన్న భావనలో కార్యకర్తలు ఉన్నారని గుమ్మల మోహన్‌రెడ్డి సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. తాను మాట్లాడిన దాంట్లో తప్పుంటే క్షమించమని కూడా కోరడం గమనార్హం. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఎంతో కృషి చేశారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య గుర్తు చేశారు. కష్టపడిన కార్యకర్తలకు, నేతలకు గుర్తింపు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీలో వివక్ష జరుగుతుందని, ఇలాంటి వాటిని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోవాలని విజ్ఞప్తి చేశారు. మిర్యాలగూడ, దేవరకొండకు చెందిన పోలగాని వెంకటేశ్, సిరాజ్‌ఖాన్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకు న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపై ఉందని గుర్తు చేశారు. ఇదే సమయంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సైతం కొందరు బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరి అల్లర్లు చేస్తున్నారని, అలాంటి వాళ్లతో జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రభుత్వ పథకాలపై ఎలాంటి వర్గాలు లేకుండా కలిసిమెలిసి పనిచేయాలని తెలిపారు. ఇంకా ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు నేనావత్ బాలూనాయక్, వేముల వీరేశం, కుందూరు రఘువీర్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న కుల గణన, సమగ్ర కుటుంబ సర్వేలో కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కుటుంబ సర్వేకు ఆటంకం కలిగించేందుకు బీఆర్ఎస్ కుట్రలు చేస్తుందని, దాన్ని సమర్థవంతంగా తిప్పికొడుతూ ప్రజల్లో ఉంటే సర్వేను విజయవంతం అయ్యేలా చూడాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

డీసీసీ సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

### కోమటిరెడ్డి బ్రదర్స్, ఎంపీలు డుమ్మా

నల్లగొండలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో డీసీసీ విస్తృత స్థాయి సమావేశానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీలు కుందూరు రఘువీర్ రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు హాజరవుతారని డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ ప్రకటించారు. కానీ ఈ సమావేశానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు ఆయన సోదరుడు, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి డుమ్మా కొట్టారు. వీరితో పాటు ఎంపీలు ఇద్దరు కూడా సమావేశానికి హాజరుకాలేదు. ప్రభుత్వం ఏర్పాటయ్యాక తొలిసారిగా జరిగిన డీసీసీ భేటీకి వీరు గైర్హాజరు కావడం పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది.

తిప్పర్తి మండలం అంతయ్యగూడెంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

## ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేయొద్దు

- ట్యాబ్‌లో ఎప్పటికప్పుడు ఎంట్రీ చేయాలి
- కలెక్టర్ ఇలా త్రిపాఠి

తిప్పర్తి, నవంబర్2 : ధాన్యం కొనుగోళ్లు జాప్యం లేకుండా చేయాలని, వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. తిప్పర్తి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం ఆమె ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, మండలంలోని అంతయ్యగూడెం వద్ద ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులు, కేంద్రం నిర్వాహకులు, కూలీలు, హమాలీలతో ఆమె ధాన్యం సేకరణకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతు నాగయ్యతో మాట్లాడుతూ ధాన్యం ఎప్పుడు తీసుకొచ్చారని అడుగగా వారం రోజుల క్రితం ధాన్యం తెచ్చానని, తేమ ఎక్కువగా ఉన్నందున ఇక్కడే ఆరబెట్టుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపాడు. వర్షం వచ్చే అవకాశం ఉన్నందున వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రంలో ఎంత మంది హమాలీలు ఉన్నారని అడుగగా 45మంది ఉన్నారని కాంట్రాక్టర్ తెలిపాడు. అంతగూడెం ఐకేపీ కేంద్రంలో 60మంది రైతులు వచ్చారని, రోజు ఒక లారీ లోడుకు సంబంధించిన ధాన్యం కేంద్రానికి వస్తున్నదని నిర్వాహకులు కలెక్టర్‌కు చెప్పారు. ధాన్యాన్ని చెత్తచెదారం లేకుండా మిల్లులకు పంపించాలని సూచించారు.

**ధాన్యం సేకరణకు మిల్లర్లు సహకరించాలి**

నల్లగొండ రూరల్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ వానకాలం పండించిన ధాన్యం సేకరణ, కస్టమ్ మిల్లింగ్ రైస్ సకాలంలో చెల్లించేందుకు జిల్లా మిల్లర్లు సహకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఆమె జిల్లా రైస్ మిల్లర్లు, పౌర సరఫరాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ధాన్యం కేటాయించిన 10 రోజుల్లోబ్యాంకు గ్యారెంటీ సమర్పించేందుకు అండర్ టేకింగ్ ఇవ్వాలన్నారు. జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు, నారాయణ, మిర్యాలగూడ రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎంఆర్ సకాలంలో చెల్లించేందుకు మిల్లర్లకు అవసరమైన వసతులు కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ట్రాన్స్‌పోర్టు బిల్లులు, మిల్లింగ్ చార్జెస్ చెల్లించాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మిల్లులకు ధాన్యం పంపించిన 15 రోజుల్లో మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీ సమర్పించేందుకు సమ్మతించారన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ హరీశ్, వ్యవసాయ జేడీ శ్రవణ్, నల్లగొండ ఆర్డీఓ అశోక్ రెడ్డి, తాసీల్దార్ స్వప్న, ఎల్‌డీఎం శ్రామిక్, ఏఓ సన్ని రాజు, ఏపీఎం శ్రీదేవి పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌ను కలిసిన ఎంజీయూ వీసీ

రామగిరి, నవంబర్2 : మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. తెలంగాణలోని అన్ని యూనివర్సిటీల వీసీలు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డితో కలిసి సీఎంకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్లకు సీఎం దిశానిర్దేశం చేశారు. కొంత కాలంగా యూనివర్సిటీపైన నమ్మకం తగ్గుతుందన్న వాస్తవాన్ని గమనంలో ఉంచుకొని, యూనివర్సిటీలపై నమ్మకం కల్గించేలా పని చేయాలని, గౌరవాన్ని పెంచాలని సూచించినట్లు ఎంజీయూ వైస్ చాన్స్‌లర్ అల్తాఫ్ హుస్సేన్ తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్

రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న మామిడాల, ఇండ్లూర్ గ్రామాల రైతులు

## కాల్వకు నీరందించి పంటలను కాపాడండి

- మామిడాల, ఇండ్లూర్ గ్రామాల రైతుల ఆందోళన

తిప్పర్తి, నవంబర్2 : ఏఎమ్మార్పీ కాల్వ పరిధిలోని ఎల్-20 ద్వారా నీరందించాలని డిమాండ్ చేస్తూ తిప్పర్తి మండలం మామిడాల, ఇండ్లూర్ గ్రామాల రైతులు శనివారం ఇండ్లూర్ గ్రామ పరిధిలోని ఏఎమ్మార్పీ కాల్వ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మామిడాల, ఇండ్లూర్, సర్వారం, యాపలగూడెం గ్రామాలకు ఎల్-20 కాల్వ ద్వారా నీరందించే విషయంలో ఇరిగేషన్ అధికారులు తాత్సారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాల్వ చివరి భూములకు నీరందించాలనే సాకుతో మొదట ఉన్న గ్రామాలను ఎండబెడుతున్నారని ఆరోపించారు. దాంతో తాము సాగు చేసిన వరి పైర్లు చివరి దశలో ఎండిపోతున్నాయని, బోర్ల ద్వారా కూడా నీరు రాని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. యాపలగూడెం, సర్వారం, ఇండ్లూరు గ్రామాల వద్ద కాల్వకు ఉన్న తూములు తొలగించి ఆయా గ్రామాల్లోని చెరువులు నిండకుండా చేస్తున్నారని వాపోయారు.

రైతులే తమ సొంత ఖర్చులతో తూములను ఏర్పాటు చేసుకొని చెరువులు నింపుకుంటుంటే అధికారులు తొలగించడం అన్యాయమన్నారు. రైతులపట్ల నిరంకుశంగా వ్యవహరించడం ప్రభుత్వానికి తగదన్నారు. తూముల ద్వారా చెరువులు నింపుకునేందుకు అధికారులు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు బొల్లెద్దు వెంకన్న, శరత్‌బాబు, చెన్నకేశవులు, నక్కనబోయిన శ్రీను, కొత్తపల్లి సైదులు, శ్రవణ్ పాల్గొన్నారు.

## డీఎస్సీ స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్జీటీ టీచర్ల భర్తీ

- 40 మందికి ఆర్డర్ కాపీలు అందజేత

రామగిరి, నవంబర్ 2 : డీఎస్సీ-2024 ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో రాష్ట్ర వ్యాప్తంగా మిగిలిన ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులకు ఎంపికైన జాబితాను రాష్ట్ర విద్యాశాఖ శనివారం సాయంత్రం విడుదల చేసింది. నల్లగొండ జిల్లాలో 40 స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్జీటీ పోస్టులు ఖాళీగా ఉండగా 1:3 పరిశీలనకు హాజరైన వారిలో 40 మందిని ఎంపిక చేశారు. వారిలో ఇద్దరికి ప్రభుత్వ, 38 మందికి లోకల్ బాడీలో టీచర్ పోస్టులు కల్పిస్తూ ఉత్తర్వులను డీఈఓ భిక్షపతి అందజేశారు. వీరంతా సోమవారం ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరనున్నారు.

అభ్యర్థులకు ఉత్తర్వులు అందజేస్తున్న డీఈఓ భిక్షపతి

## ఆగి ఉన్న ట్రావెల్స్ బస్సును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- 30 మందికి గాయాలు.. నలుగురి పరిస్థితి విషమం

కోదాడ టౌన్, నవంబరు 2 : ఆగి ఉన్న ట్రావెల్స్ బస్సును వెనుక నుంచి ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు ఢీకొట్టడంతో 30 మందికి తీవ్ర గాయాలయ్యాయి. కోదాడ జాతీయ రహదారి కట్టకొమ్ముగూడెం వద్ద శనివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే హైదరాబాద్ నుంచి (రాజమండ్రి) గోకవరానికి ప్రయాణికులతో వెళ్తున్న మహి ట్రావెల్స్ బస్సు కోదాడ సమీపంలోకి రాగానే ప్రయాణికులు వాష్‌రూంకి వెళ్తానంటే రోడ్డు పక్కన నిలిపాడు. ఈ క్రమంలోనే వెనుక నుంచి అతివేగంగా వచ్చిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు ట్రావెల్స్ బస్సును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు బస్సుల్లోనే ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన 25 మందిని చికిత్స నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరో ఆరుగురిని కోదాడలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులకు తీసుకెళ్లారు. వారిలో నలుగురు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు. ఆగి ఉన్న బస్సు ఒక్కసారిగా రోడ్డు మీదికి రావడంతోనే ప్రమాదం జరిగినట్లుగా తెలుస్తున్నది. గాయపడిన వారిలో వెంకటేశ్వరరావు, కె.మణి, దానియేలు పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. నవ్య, ఆదిత్య, తేజ, డేవిడ్ కోదాడలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి పరిస్థితి కూడా విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

ఢీకొన్న రెండు బస్సులు

## ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వలో పడి తండ్రీకొడుకు గల్లంతు

నల్లగొండ సిటీ, నవంబర్ 2 : నల్లగొండ జిల్లా కనగల్ మండలం శాబ్దులాపురం గ్రామంలో పండుగ పూట విషాదం జరిగింది. ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వలో శనివారం తండ్రీ కొడుకు పడి గల్లంతయ్యారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సురవరం దామోదర్(40), అతని కుమారుడు ఫణీంద్రవర్మ అలియాస్ బిట్టు (14)స్నానం చేయడానికి గ్రామ సమీపంలో ఉన్న ఏఎమ్మార్పీ ప్రధా న కాల్వ వద్దకు వెళ్లారు. కాల్వలో ఈత కొడుతున్న సమయంలో ఫణీంద్రవర్మ వరద తాకిడికి కొట్టుకుపోయాడు. ఇది గమనించిన తండ్రి దామోదర్ కొడుకును కాపాడే సమయంలో కాల్వలోకి దిగగా వరద తాకిడి ఎక్కువగా ఉండడంతో అత ను కూడా కొట్టుకుపోయాడు. ఇదే సమయంలో వారి బంధువులు కొందరు అక్కడే ఉన్నప్పటికీ కాల్వలో వరద అధికంగా ఉండడంతో ఏమీ చేయలేకపోయారు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకొని గాలిస్తున్నారు. దామోదర్ కుటుంబం గత కొంత కాలంగా నల్లగొండ మండలం బుద్ధారంలో ఉంటున్నారు. దీపావళి పండుగ కావడంతో తమ సొంత ఊరికి వచ్చారు. పండుగ పూట తండ్రీ కొడుకులు గల్లంతు కావడంతో ఆ కుటుంబంలో, గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సంఘటనా స్థలానికి ఫైర్ ఇంజిన్‌తో పాటు గజ ఈతగాళ్లతో గాలిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపారు.

తండ్రీకొడుకులు దామోదర్, ఫణీంద్రవర్మ (ఫైల్)

గుండాల శంకరయ్య(ఫైల్)

**బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టులో ఒకరు..**

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణ వెల్లెంల(ఉదయ సముద్రం ప్రాజెక్టు)లో శనివారం సాయంత్రం ఈతకు వెళ్లిన వ్యక్తి గల్లంతయ్యాడు. నల్లగొండ మండలం అప్పాజిపేటకు చెందిన గుండాల శంకరయ్య(50) చిట్యాల మండలం నేరడ గ్రామంలోని తన వియ్యంకుడి ఇంటికి దీపావళి పండుగకు వచ్చాడు. ఉదయ సముద్రం ప్రాజెక్టులోకి అధికారులు ట్రయల్‌రన్‌లో భాగంగా నీటిని విడుదల చేస్తుండడంతో దానిని చూసేందుకు బ్రాహ్మణ వెల్లెంలకు వెళ్లాడు. ప్రాజెక్టులో ఈత కొట్టేందుకు దిగాడు. నీటి ప్రవాహం అధికంగా రావడంతో కొద్దిదూరం కొట్టుకుపోయి నీటిలో మునిగి పోయాడు. స్థానికులు, బంధువులు రక్షించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. స్థానికుల సమాచారంతో నార్కట్‌పల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొన్నారు. నల్లగొండ నుంచి అగ్నిమాపక సిబ్బందిని రప్పించి గాలింపు జరుపుతున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

శ్రీశైలానికి లాంచీ ప్రయాణం జెండా ఊపి ప్రారంభిస్తున్న నందికొండ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ తిరుమలకొండ అన్నపూర్ణ, టూరిజం అధికారులు

## అలలపై సాగర్ టు శ్రీశైలం

- లాంచీ ప్రయాణం ప్రారంభం

నందికొండ, నవంబర్ 2 : నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలానికి లాంచీ ప్రయాణం ప్రారంభమైంది. నదీ మార్గంలో లాంచీ ప్రయాణానికి తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఉన్నతాధికారులు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో శనివారం నందికొండ మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమలకొండ అన్నపూర్ణ, టూరిజం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నర్సింహ, మేనేజర్ హరిబాబు కలిసి లాంచీకి పూజలు నిర్వహించి జెండా ఊపి ప్రయాణాన్ని ప్రారంభించారు. నాగార్జునసాగర్ నుంచి ఉదయం 10 గంటలకు ప్రారంభమైన లాంచీ ప్రయాణం సాయంత్రం 4 గంటలకు శ్రీశైలం చేరుకుంటుంది. తిరిగి ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీశైలం నుంచి బయల్దేరి సాయంత్రం నాగార్జునసాగర్‌కు చేరుకుంటుంది. మొదటి రోజు 88 మంది ప్రయాణికులతో లాంచీ బయల్దేరింది. రెండు రోజుల పాటు అలలపై సాగే లాంచీ ప్రయాణికులకు జలపాతాలు, అటవీ ప్రాణులు, జింకలు, దుప్పులు, నదికి ఇరువైపులా నల్లమల కొండలు మధురానుభూతులను మిగులుస్తాయి. ప్రతి శనివారం నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలానికి లాంచీ ప్రయాణం ఉంటుందని, ప్రయాణికులకు హైదరాబాద్ నుంచి బస్సు, లాంచీలో భోజన సాకర్యం ఉంటుందని టూరిజం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నర్సింహ తెలిపారు.

## పరేడ్ గ్రౌండ్ పేరుతో హోంగార్డుల కట్టడి

- డ్యూటీలు వేసి చలో ఇందిరా పార్క్‌కు వెళ్లకుండా నిలువరింపు

నీలగిరి, నవంబర్ 2 : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హోంగార్డుల సంఘం ఇచ్చిన చలో ఇందిరాపార్కు కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ యంత్రాంగం శనివారం పరేడ్ పేరుతో ఎక్కడికక్కడ అడ్డుకున్నది. అన్ని పోలీస్‌స్టేషన్లలోని హోంగార్డులు జిల్లా పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే పరేడ్ కార్యక్రమానికి కచ్చితంగా హాజరు కావాలని హుకూం జారీ చేసింది. దీంతో ప్రతి హోంగార్డు ఆయా పోలీస్ స్టేషన్లు, జిల్లా పరేడ్ గ్రౌండ్‌కు హాజరుకావడంతో వారికి డ్యూటీలు వేశారు. కచ్చితంగా విధులు నిర్వర్తించాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేయడంతో వారు చేసేది లేక విధులు నిర్వర్తించారు. జిల్లా నుంచి ఇందిరాపార్కు కార్యక్రమానికి వెళ్లలేదు.

**హోంగార్డు ముందస్తు అరెస్టు**

తిరుమలగిరి : మండల పరిధిలోని కన్నారెడ్డికుంటతండాకు చెందిన హోంగార్డు భూక్య సోమ్లానాయక్ భువనగిరిలో విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా శనివారం తమ సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద హోంగార్డులు నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమానికి తన నివాసం నుంచి బయల్దేరుతున్న క్రమంలో తిరుమలగిరి పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. అనంతరం విడుదల చేశారు. ఈ సందర్భంగా హోంగార్డు సోమ్లానాయక్ మాట్లాడుతూ అధికారంలోని వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేసాడు.

తిరుమలగిరిలో హోంగార్డును అరెస్టు చేసిన పోలీసులు

## ఎమ్మెల్యే సామేల్ తీరుపై పీసీసీకి ఫిర్యాదు

అర్వపల్లి, నవంబరు 2 : తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ వ్యవహరిస్తున్న తీరుపై అదే పార్టీకి చెందిన కాంగ్రెస్ సూర్యాపేట పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ధరూరి యోగానంద చార్యులు శనివారం గాంధీభవన్‌లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గత కొన్ని నెలలుగా తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీకి వలస వచ్చినవారు ఎమ్మెల్యేకు కోటరిగా వ్యవహరిస్తూ పార్టీకి నష్టం కలుగజేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే ముందు నుంచి పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తిరుమలగిరి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఇంతకు ముందుకు ప్రకటించినట్టుగా పాలకుర్తి రాజయ్య కుటుంబ సభ్యులకే ఇవ్వాలని గుర్తుచేశారు. పీసీసీ అధ్యక్షుడు సానుకూలంగా స్పందించి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్వపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోరపాక సత్యం, మండల సీనియర్ నాయకులు, రత్నం, సంతోశ్ ఉన్నారు.

పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను కలిసిన డీసీసీ సూర్యాపేట ఉపాధ్యక్షుడు దరూరి యోగానంద చార్యులు

## రేపు నల్లగొండకు బీసీ కమిషన్ బృందం రాక

సూర్యాపేట, నవంబర్ 2 : ఈ నెల 4న ఉమ్మడి నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బీసీ కమిషన్ బృందం వస్తున్నట్లు సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ కమిషన్ బృందం సూర్యాపేట జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సంచార జాతుల సామాజిక, రాజకీయ, ఆర్థిక విశ్లేషణ చేయనున్నట్లు పేర్కొన్నారు. నల్లగొండ కలెక్టరేట్‌లో సోమవారం బీసీ కమిషన్ చైర్మన్ నేతృత్వంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని వివిధ సామాజిక వర్గాలు, ప్రజా ప్రతినిధులు, ఆసక్తి గల వారు తమ అభిప్రాయాలను రాత పూర్వకంగా బీసీ కమిషన్ బృందానికి అందజేయవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థనతోపాటు ప్రభుత్వం నిర్దేశించిన ఫార్మాట్‌ను పూరించి 5సెట్లను నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లో(సూర్యాపేట జిల్లా కౌంటర్) బీసీ కమిషన్‌కు అందజేయాలన్నారు. వారి వాదనలకు మద్దతుగా సాక్ష్యాలను జతపర్చాలని పేర్కొన్నారు.